

రైతును రాజును చేయాలన్నదే
ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 2 సంచిక - 185 ఆదివారం12 అక్టోబర్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts




## నోబెల్ శాంతి బహుమతి ఇమ్మని అడగలేదు

- మచాడతో ఫోన్‌లో మాట్లాడనని ట్రంప్ వెల్లడి
- ఆమె పోరాటానికి తన మద్దతు ఉంటుందని ప్రకటన

**/వాషింగ్టన్, అక్టోబర్ 11(జర్నలిస్ట్ వార్త):** ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి బహుమతి దక్కకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా స్పందించారు. ఈ బహుమతి కోసం ట్రంప్ తహతహలాడిన విషయం తెలిసిందే. అయితే, ట్రంప్ 'శాంతి' ఆశలపై నీళ్లు చల్లుతూ 2025 నోబెల్ శాంతి బహుమతి వెనెజువెలా ప్రధాన ప్రతిపక్ష నాయకురాలు, ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న మరియా కొరీనా మచాడోకు నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో మిగతా2లో...

# గ్లోబల్ మార్కెట్లో పోటీపడాలి

- ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను పండించాలి
- ఇతర దేశాలపై ఆధారపడకుండా స్వయంసమృద్ధి సాధించాలి
- జీఎస్టీ సంస్కరణతో రైతులు, గ్రామీణ రంగానికి ప్రయోజనం
- సాగు వ్యయం తగ్గించేందుకు ఐదేళ్లలో రూ.13లక్షల కోట్ల సబ్సిడీ



### ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని ప్రారంభించిన మోడీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 11(జర్నలిస్ట్ వార్త):** దేశం వికసిత్ భారత్ వైపు అడుగులు వేయడంలో రైతులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. భారత్ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే.. కేవలం వరి, గోధుమ పంటల పైనే కాకుండా ప్రొటీన్ అధికంగా లభించే పప్పులకు సంబంధించిన సాగును మరింత పెంచాలని రైతులకు సూచించారు. ప్రపంచ మార్కెట్‌లకు ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను పండించాలన్నారు. దేశంలో పంటల ఉత్పత్తికి అయ్యే ఖర్చులు తగ్గించి.. రైతుల ఆదాయం పెంచే దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో పదేళ్లలో వ్యవసాయ రంగంలో కేవలం రూ.5 లక్షల కోట్ల సబ్సిడీలు ఇస్తే.. తమ ప్రభుత్వం పదేళ్లలో రైతులకు రూ.13 లక్షల కోట్లకు పైగా సబ్సిడీలు ఇచ్చిందని పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో శనివారం నాడు జరిగిన ప్రత్యేక కృషి ప్రోగ్రాంలో ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా గత నెలలో అమల్లోకి వచ్చిన జీఎస్టీ సంస్కరణతో రైతులు, దేశంలోని గ్రామీణ రంగానికి మరింత ప్రయోజనం చేకూరిందని మోదీ చెప్పారు. గత ప్రభుత్వాలకు వ్యవసాయంపై మిగతా2లో...

## హైకోర్టు స్టేతో సుప్రీంలో సవాల్

- 42శాతం బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం
- పార్టీ నేతలు, మంత్రులతో చర్చించిన సిఎం రేవంత్



**హైదరాబాద్,అక్టోబర్ 11(జర్నలిస్ట్ వార్త):** :బీసీ రిజర్వేషన్ల పై సుప్రీంకోర్టు కి వెళ్లాలని నిర్ణయం తీసుకుంది. సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన జీవో 9 పై తెలంగాణ హైకోర్టు స్టే విధించడంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైకోర్టు తీర్పు ను స్టడీ చేసిన ప్రభుత్వం.. సీనియర్ కౌన్సిల్ తో సుప్రీంకోర్టు లో వాదనలు వినిపించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. అభిషేక్ మను సింగ్వి తో పాటు సిద్ధార్థ దవే.. రిజర్వేషన్ల పై ప్రావీణ్యం కలిగిన అడ్వకేట్ లతో వాదనలు వినిపించాలని నిర్ణయించినట్లు సమాచారం. హైకోర్టు స్టే నేపథ్యంలో స్థానిక మిగతా2లో...

## ఉప్పాడ కాలుష్యంపై చర్యలు

- కాలుష్య నియంత్రణ అధికారులతో పవన్ చర్చలు



**అమరావతి, అక్టోబర్ 11(జర్నలిస్ట్ వార్త):** ఉప్పాడ మత్స్యకారులతో చర్చించిన తరవాత ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాలుష్య సమస్యలపై చర్యలకు ఉపక్రమించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో పవన్ కల్యాణ్ ఇవాళ శనివారం మిగతా2లో...



## వాట్సాప్ లేకుంటే ఏమి...?

- 'అరట్టై' ఉపయోగించండి
- పిటిషనర్‌కు సుప్రీం సలహా

**న్యూఢిలీఅక్టోబర్ 11(జర్నలిస్ట్ వార్త):** వాట్సప్‌కు పోటీగా తీసుకొచ్చిన స్వదేశీ మెసేజింగ్ యాప్ "అరట్టై' పేరు ఇటీవల నెట్టింట మార్మోగుతోంది. తాజాగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులోనూ దీని ప్రస్తావన మిగతా2లో...

## 42 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

- బీజేపీ, బీఆర్ఎస్ కలిసి బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే కుట్ర
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు



**హైదరాబాద్,అక్టోబర్ 11(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని మరోసారి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ల జీవోను, ఎన్నికల నోటిఫికేషన్ అమలుపై హైకోర్టు స్టే ఇచ్చినందున సుప్రీంకోర్టుకు వెళ్లి అప్పీలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అక్కడ వెసులు బాటు దొరుకుతదని ఆశిస్తున్నట్లు తెలిపారు. రిజర్వేషన్లు ఆపటంలో అసలైన ముద్దాయి బీజేపీ అని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ మిగతా2లో...

## జూబ్లీహిల్స్ కోసం బిఆర్ఎస్ వార్ రూమ్

- పార్టీ నేతలతో కెటిఆర్ టెలి కాన్ఫరెన్స్



**హైదరాబాద్,అక్టోబర్ 11(జర్నలిస్ట్ వార్త):** జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై ప్రతిపక్ష బీఆర్ఎస్ సీరియస్‌గా దృష్టి సారించింది. ఇందులో భాగంగా శనివారం ఉప ఎన్నిక ఇంఛార్జ్‌లతో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ టెలీ కాన్ఫిరెన్స్ నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంపై ఇంచార్జ్‌లకు కేటీఆర్ దిశానిర్దేశర చేశారు. మరోవైపు బై ఎలక్షన్ కోసం వార్ రూం ఏర్పాటు చేస్తోంది బీఆర్ఎస్. వార్ నుంచే ఉప ఎన్నిక కార్యకలాపాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఉప ఎన్నిక ప్రచారం, సభలు, ర్యాలీలకు బీఆర్ఎస్ ఎ÷–లాన్‌ను సిద్ధం చేస్తోంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ మంత్రులు కేటీఆర్, మిగతా2లో...

## పదేళ్లలో కాళేశ్వరం కడితే.. మూడేళ్లకే కూలింది

- అయినా రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి
- కృష్ణాగోదావరి జలాల్లో రాజీపడేది లేదు
- ఆల్మట్టి ఎత్తును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించం
- హరీష్ రావు అబద్దాల ప్రచారంమానుకోవాలి
- మిడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్




## కాంగ్రెస్‌లో మరో ఇద్దరు మంత్రుల పంచాయితీ

- మేడారం కాంట్రాక్టుల విషయంలో రచ్చ
- వరంగల్‌లో వేలు పెడుతున్న పొంగులేటి
- మండిపడ్డ కొండా సురేఖ దంపతులు




## విలువిద్యను దేశవ్యాప్తంగా ప్రోత్సహించడమే లక్ష్యం

- ప్రధాని మోదీని కలిసిన రామ్ చరణ్, ఉపాసన...
- కొత్తగా ప్రారంభించిన ఆర్చరీ లీగ్ విజయంపై చర్చ



# వికసిత్ భారత్‌లో రైతులది ముఖ్య భూమిక

(మొదటి పేజీ తరువాయి)

ఎలాంటి విజన్ లేదని విమర్శించారు. రైతుల ఆదాయం పెంచేందుకు, పంటల సాగు వ్యయం తగ్గించేందుకు గత పదేళ్లుగా ఎన్డీయే ప్రభుత్వం ఎరువులపై రూ.13లక్షల కోట్ల సబ్సిడీ ఇచ్చిందని ప్రధాని మోదీ అన్నారు. యూపీఏ పదేళ్లలో రూ.5 లక్షల కోట్లు మాత్రమే సబ్సిడీగా ఇచ్చిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు వ్యవసాయరంగానికి ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని వివరించారు. రైతులకు కేంద్రంలోని గత కాంగ్రెస్ ప్రభుత్వం చేసేందేమీ లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 2004 నుంచి 2014 వరకూ యూపీఏ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయరంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అయితే బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 11 ఏళ్లుగా రైతుల అభివృద్ధి, స్వయం సమృద్ధికి ఎన్నో చర్యలు తీసుకుందని వివరించారు. వ్యవసాయరంగానికి సంబంధించిన వివిధ శాఖలు ఇష్టారీతిలో వ్యవహరించడం వల్ల దేశంలోని వ్యవస్థాయ వ్యవస్థ బలహీనమవుతూ వచ్చిందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిలో మార్పులు చేస్తూ విత్తనాల దగ్గర నుంచి మార్కెట్ వరకూ రైతులకు ప్రయోజనాలు చేకూరే లెక్కలేనని సంస్కరణలు తెచ్చామని చెప్పారు. దేశ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు దాదాపు రెట్టింపయ్యాయని, ఆహారధాన్యాలు, పళ్లు, కాయగూరల ఉత్పత్తి సుమారు 90 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెరిగిందని, గతంలో ఇది 64 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉండేదని చెప్పారు. 2014 నుంచి తేనె ఉత్పత్తి రెట్టింపు అయిందని అన్నారు. అభివృద్ధి భారతాన్ని కోరుకుంటే ప్రతి రంగంలోనూ ఇండియా బలపడాల్సి ఉంటుందన్నారు. ఏవో కొన్ని సాధించినంత మాత్రాన తృప్తి పడిపోరాదని సూచించారు. వెనుకబడిన ప్రాంతాలపై దృష్టి పెట్టినప్పుడే గణనీయమైన ఫలితాలు ఉంటాయన్నారు. ఇవాళ యాస్పిరేషనల్ జిల్లాల్లో ప్రసూతి మరణాలు తగ్గాయని, చైల్డ్ హెల్త్ మెరుగైందని, విద్యాప్రమాణాలు పెరిగాయని చెప్పారు. దీంతో ఈ జిల్లాలు ఇతర జిల్లాల కంటే మెరుగైన రీతిలో దూసుకెళ్తున్నాయని, ఈ మోడల్ ఆధారంగా వ్యవసాయంలో వెనుకబడిన 100 జిల్లాలను అభివృద్ధి చేసేందుకు దృష్టి సారించామని, ఇందువల్ల అవి మరింత మెరుగైన జిల్లాలుగా మారనున్నాయని చెప్పారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే అన్ని రంగాల్లో నిరంతరం కొత్త మార్పులు చోటుచేసుకోవాలని ప్రధాని పేర్కొన్నారు. ఈ ఆలోచనలో భాగంగానే ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు దేశంలోని 100కు పైగా జిల్లాలను వెనకబడిన జిల్లాలుగా ప్రకటించి.. ఆపై వాటిని పూర్తిగా మరిచిపోయాయని ప్రధాని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ వెనకబడిన జిల్లాలపై ప్రత్యేక దృష్టిసారించి, వాటిని ఆశావహ జిల్లాలుగా ప్రకటించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాజెక్టులను అమలుచేస్తోందన్నారు. వీటన్నింటినీ ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన కిందకు తీసుకువస్తున్నట్లు తెలిపారు. వెనకబడిన జిల్లాలలోని అనేక ప్రాంతాల్లో గత పాలకులు రోడ్లు కూడా వేయించలేదని.. అటువంటి వాటిని తమ ప్రభుత్వం డిజిటల్ ఇండియా దిశగా నడిపిస్తోందన్నారు. గ్రామీణప్రాంత ప్రజలకు విద్య, వైద్యం, నివాసం, విద్యుత్, రోడ్డు వంటి అన్నిరకాల సదుపాయాలు కల్పించడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత పదకొండేళ్లలో రైతులు పలు విజయాలు సాధించారని.. పదివేలకు పైగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పడ్డాయన్నారు.

# 42 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

(మొదటి పేజీ తరువాయి)

కలిసి బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. గవర్నర్ దగ్గర బిల్లుని పెండింగ్ లో ఉంచారని.. గవర్నర్‌ను నియమించేది ఎవరని ప్రశ్నించారు. మూడు చట్టాలు ఒక ఆర్డినెన్సు గవర్నర్ వద్ద పెండింగ్ లో ఉన్నాయని చెప్పారు. బీసీలకు నోటి దాకా వచ్చిన ఫలాలను అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉందన్న ఆయన.. మోదీ బీసీ ప్రధాని అని చెప్పుకునే బీజేపీ నేతలు, బీసీ రిజర్వేషన్ బిల్లుపై ఎందుకు ఒత్తిడి తీసుకురావటం లేదు? అని ప్రశ్నించారు. ఏపీ ప్రాజెక్టు బనకచర్ల విషయంలో చేయాల్సింది అంత చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ ఉదాసీనత వల్ల జీవో ఇచ్చారని దుయ్యబట్టారు.

# జూబ్లీహిల్స్ కోసం బిఆర్ఎస్ వార్ రూమ్

(మొదటి పేజీ తరువాయి)

హరీష్ రావు ర్యాలీలు నిర్వహించనున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో బీఆర్ఎస్ ముందుకు వెళ్తోంది. కాగా.. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నిక అనివార్యమైంది.జూబ్లీహిల్స్‌లో మరోసారి గులాబీ పార్టీ జెండా ఎగువేయాలనే లక్ష్యంతో ఉంది బీఆర్ఎస్. అందులో భాగంగానే జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భార్య మాగంటి సునీత పేరును ప్రకటించింది ఆ పార్టీ. సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవడం బీఆర్ఎస్‌కు పెద్ద సవాల్ అనే చెప్పుకోవాలి. ఇప్పటికే ప్రచారాన్ని కూడా నిర్వహిస్తోంది. ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తోంది. సిట్టింగ్ స్థానాన్ని దక్కించుకోవాలనే పట్టుదలతో బీఆర్ఎస్ ఉంది.నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరుగనుంది. నవంబర్ 14న కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఈనెల (అక్టోబర్) 13న నోటిఫికేషన్ విడుదల కానుండగా.. అక్టోబర్ 21 నామినేషన్ దాఖలుకు చివరి తేదీ. అలాగే ఈనెల 22న నామినేషన్ల పరిశీలన జరుగనుంది.

# పదేళ్లలో కాలేశ్వరం కడితే..మూడేళ్లకే కూలింది

**హనుమకొండ్లఅక్టోబర్ 11(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకు తాము పోరాడుతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్ట్‌పై కేంద్రానికి ఇప్పటికే లిఖిత పూర్వక ఫిర్యాదు చేశామని చెప్పారు. అలాగే ఆలమట్టి ఎత్తు పెంపునకు వ్యతిరేకంగా కూడా తాము ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో కట్టకుండా చూస్తామని మంత్రి ఉత్తమ్ ప్రకటించారు. అయితే నీటి పంపకాల పంచాయతీలో మంత్రి హోదాలో హాజరైన ఏకైక వ్యక్తిని తానేనని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు. మీరు నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికి రాకుండా పోయిందంటూ హరీశ్ రావుకు చురకలంటించారు. ఈ 22 నెలల్లో కాళేశ్వరం ప్రాజక్ట్ నయాపైసా కూడా పనికి రాలేదన్నారు. మంత్రి సీతక్కతో కలిసి హనుమకొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగా ఉండి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నుంచి చుక్కనీరు లిఫ్ట్ చేయకుండా మేం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మూడో పంటలో కూడా భారతదేశంలో అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించింది. ఈ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 108.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పడుతోంది. దాంట్లో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయబోతోంది. భారత దేశంలో ఇంత ధాన్యం ఇప్పటి వరకు ఏ రాష్ట్రం కొనుగోలు చేయలేదని మంత్రి వివరించారు. హరీశ్ రావు మంత్రిగా ఉన్న సమయంలో గోదావరి జలాలను ఆంధ్రకు అప్ప జెప్పారని గుర్తు చేశారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ వాటా నీటిని తాము కాపాడుకుంటామని తెలిపారు. తప్పుడు మాటల ద్వారా అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారంటూ హరీశ్ రావుపై మండిపడ్డారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బీఆర్ఎస్ కట్టిన ఏకైక కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ కూలిపోయిందని వ్యంగ్యంగా అన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ తుమ్మడిహెట్టి వద్ద తట్టెడు మట్టి ఎత్త లేదని విమర్శించారు. గోదావరి జలాల విషయంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే తెలంగాణకు మేలు జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. హరీశ్ రావు మాట్లాడిన మాటలలో వాస్తవాలు ఏమి లేవని.. ఈ తరహా ప్రచారాన్ని మానుకోవా లంటూ ఆయనకు ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేశంలోనే అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డుల కెక్కిందని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. త్వరలో ధాన్యం కొనుగోళ్లు కూడా ప్రారంభమవుతాయన్నారు. అది కూడా మూడేళ్లకే కూలిందని మంత్రి ఉత్తమ్ అన్నారు.అవాస్తవాలు మాట్లాడుతూ.. తమ ప్రభుత్వాన్ని బద్నాం చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెలే, మాజీ మంత్రి టి. హరీశ్ రావుకు తెలంగాణ భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. అబద్దాలను ప్రచారం చేస్తూ ఆరోపణలు చేయడం సరికాదంటూ హరీశ్ రావుకు ఆయన హితవు పలికారు. బనకచర్లపై హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. అంతేకాదు.. బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణానికి పార్టీ వ్యతిరేకమని తాము మొదటి నుంచి చెబుతున్నామని గుర్తు చేశారు.

# 14న బిసి కులాల బంద్
# : కిషన్ రెడ్డి మద్దతు కోరిన కృష్ణయ్య

**హైదరాబాద్అక్టోబర్ 11(జర్నలిస్ట్ వార్త):** బీసీ రిజర్వేషన్లకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసనగా ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపునిస్తున్నట్లు బీసీ సంఘాల నాయకుడు ఆర్ కృష్ణయ్య ప్రకటించారు. అన్ని బీసీ సంఘాల మద్దతుతో బంద్ నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. అందరూ కలిసి బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. రాజకీయ పార్టీలు, కుల సంఘాలు బంద్‌కు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బంద్‌కు బీజేపీ మద్దతు ఇవ్వాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కోరడం జరిగిందని తెలిపారు. దీనిపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కిషన్ రెడ్డి చెప్పారని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చాక కోర్టులు జోక్యం చేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. బీసీ సంఘాలు ఇప్పటికే పెద్ద ఎత్తున రౌండ్ టేబుల్ సమావేశం, నిరసనలు, ధర్నాలు చేస్తున్నారని ఎంపీ ఆర్.కృష్ణయ్య వెల్లడించారు.

# కాంగ్రెస్‌లో మరో ఇద్దరు మంత్రుల పంచాయితీ

**వరంగల్‌,అక్టోబర్ 11(జర్నలిస్ట్ వార్త): :** మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్ మధ్య వివాదం మరువక ముందే.. కాంగ్రెస్ క్యాబినెట్ మంత్రుల మధ్య మరో లొల్లి మొదలైంది. మేడారం అభివృద్ధి టెండర్ల విషయంలో వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఆ శాఖకు చెందిన మంత్రుల మధ్య విభేదాలు ముదిరి రచ్చకెక్కాయి. మంత్రి పొంగులేటిపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సీఎం రేవంత్ రెడ్డికి, పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. వరంగల్ రాజకీయాలతోపాటు దేవాదాయ శాఖలో మంత్రి పొంగులేటి జోక్యం చేసుకుంటున్నట్లు కొండా దంపతులు అందులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకి ఫోన్ చేసిన కొండా మురళి ఆయనకు ఫిర్యాదు చేశారు. పొంగులేటి తన సొంత కంపెనీకి పనులు ఇప్పించుకుంటున్నారని తెలిపారు. ఆయన వల్ల జిల్లాలో తాము ఇబ్బంది పడుతున్నామని వెల్లడించారు. అదేవిధంగా జిల్లా రాజకీయాలను ఖర్గేకి వివరించారు. పార్టీ పెద్దలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లారు. హైకమాండ్ నుంచి సానుకూల స్పందన వచ్చిందని కొండా దంపతులు పేర్కొన్నారు. కాగా, ఇటీవల మేడారంలో పర్యటించిన సీఎం రేవంత్ రేవంత్ రెడ్డి.. పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వరంగల్ జిల్లా రాజకీయాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జోక్యం చేసుకుంటున్నారంటూ కాంగ్రెస్ నేత కొండా మురళి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ జిల్లాలో పొంగులేటి పెత్తనం ఏంటని ఆయన ప్రశ్నించారు. దీనిపై ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖలో పొంగులేటి జోక్యంపై పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేకు ఫిర్యాదు చేశారు. మేడారం టెండర్ల వ్యవహారంపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పొంగులేటి సొంత కంపెనీకి పనులు ఇప్పించుకున్నారని అందులో ఆరోపించారు. ఈ వ్యవహారంలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీలతోపాటు మీనాక్షి నటరాజన్‌కు సైతం కొండా మురళి ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో హైకమాండ్ నుంచి సానుకూల స్పందన వచ్చినట్లు ఆయన తెలిపారు.

# తెలంగాణలో నాలుగు రోజుల పాటు వర్షాలు

## ● హైదరాబాద్

## వాతావరణ కేంద్రం వెల్లడి

**/హైదరాబాద్,అక్టోబర్ 11(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర తమిళనాడు తీరప్రాంతం, పరిసర ప్రాంతాల్లో సగటు సముద్రమట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని పేర్కొంది. ఉత్తర కోస్తాంధ్ర, పరిసర ప్రాంతాల్లో సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని.. దక్షిణ ఒడిశా నుంచి ఏపీ తీర ప్రాంతం మీదుగా ఉత్తర తమిళనాడు వరకు సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతుందని చెప్పింది. శనివారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.ఆదివారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో.. సోమవారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగు లాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. మంగళవారం ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మ హబూబాబాద్, వరం గల్, హను మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

# నోబెల్ శాంతి బహుమతి ఇమ్మని అడగలేదు

(మొదటి పేజీ తరువాయి)

శాంతి బహుమతి దక్కకపోవడంపై ట్రంప్ తాజాగా స్పందించారు. ఈ మేరకు మరియా కొరీనా మచాడోతో ఫోన్‌లో సంభాషించినట్లు తెలిపారు. 'కొరీనా మచాడోతో ఫోన్‌లో మాట్లాడాను. నా గౌరవార్థం దాన్ని స్వీకరించినట్లు ఆమె నాతో చెప్పారు. అలా అని ఆ బహుమతి నాకు ఇచ్చేయమని నేను అడగలేదు. విపత్తు సమయంలో వెనెజువెలాలోని ప్రజలకు ఆమె చాలా సాయం చేశారు. నేను ఆమెకు తోడున్నా. ఇకముందు కూడా ఉంటా' అని వైట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి మరియా కొరీనా మచాడోను వరించిన విషయం తెలిసిందే. ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసం విశేషంగా కృషి చేసిన మచాడో వెనెజువెలా ఉక్కు మహిళగా కూడా పేరుపొందారు. టైమ్ మ్యాగజైన్ ప్రచురించిన ప్రపంచంలోని అత్యంత పలుకుబడిగల 100 మంది ప్రముఖుల జాబితాలో కూడా ఆమె చోటు దక్కించుకున్నారు. గత ఏడాది జరిగిన వెనెజువెలా పార్లమెంట్ ఎన్నికలలో భారీ స్థాయిలో రిగ్గింగ్ జరిగి ప్రస్తుత అధ్యక్షుడు నికొలస్ మదురో గెలుపొందిన తర్వాత 58 ఏళ్ల మచాడో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ శాంతి బహుమతి దక్కడంపై మరియా కొరీనా స్పందిస్తూ.. 'స్వేచ్ఛ కోసం, ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న వెనెజువెలా ప్రజలందరికీ ఈ గుర్తింపు గొప్ప ప్రేరణ ఇస్తుంది. లక్ష్యసాధనలో విజయానికి చేరువలో ఉన్నాం. ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలు మాకు మిత్రులు. ఈ పురస్కారాన్ని కష్టాల్లో ఉన్న వెనెజువెలా ప్రజలతోపాటు మా పోరాటానికి నిర్మాణాత్మక మద్దతు ఇస్తున్న ట్రంప్‌నకు అంకితం ఇస్తున్నా' అని అన్నారు.

# ఉప్పాడ కాలుష్యంపై చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

సమీక్ష సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమీక్షలో కాకినాడ జిల్లా యంత్రాంగం పాల్గొంది. ఉప్పాడ తీర ప్రాంతంలో కాలుష్య నియంత్రణ అంశాలపై దిశానిర్దేశం చేశారు పవన్ కల్యాణ్. కాకినాడ జిల్లాలో ఉన్న పారిశ్రామిక కాలుష్యం, మైనింగ్ మూలంగా తలెత్తుతున్న కాలుష్య ఇబ్బందులపై చర్చించారు. కాకినాడలో చేపట్టిన మత్స్యకారులతో మాట.. మంతిలో మత్స్యకారులు ప్రస్తావించిన అంశాలు, వారి సందేహాలపై పీసీబీ నుంచి వివరాలు తీసుకున్నారు పవన్ కల్యాణ్. పొల్యూషన్ ఆడిట్‌కి అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించారు. కాకినాడ జిల్లాతోపాటు గోదావరి జిల్లాల్లో ఉన్న కాలుష్య పరిస్థితులు, పర్యావరణ పరిరక్షణపై వివరాలు అడిగి పవన్ కల్యాణ్ తెలుసుకున్నారు.

## వాట్సాప్ లేకుంటే ఏమి...?

(మొదటి పేజీ తరువాయి)

వచ్చింది. వాట్సప్ ఖాతా పునరుద్ధరణకు సంబంధించి దాఖలైన ఓ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. వాట్సప్ లేకపోతే ఏం.. అర్టటై వాడొచ్చు కదా అని సూచించింది. తన ఖాతాను వాట్సప్ బ్లాక్ చేసిందని, దాన్ని పునరుద్ధరించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. సామాజిక మాధ్యమాలు ఇలా ఖాతాలను ఉన్నట్టుండి నిషేధించకుండా ఉండేలా మార్గదర్శకాలు జారీ చేయాలని పిటిషనర్ న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై సుప్రీం ధర్మాసనం ఒకింత అసహనం వ్యక్తంచేసింది. ఆర్టికల్ 32 కింద ఈ పిటిషన్ ఎందుకు వేశారని అడిగింది. వాట్సప్ యాక్సెస్ ఉండటం ప్రాథమిక హక్కు ఎలా అవుతుందని ప్రశ్నించింది. దీనికి పిటిషనర్ తరఫు న్యాయవాది బదులిస్తూ.. పిటిషనర్ ఓ పాలీ డయాగ్నిక్ సెంటర్‌లో పనిచేస్తున్నారు. గత 10-12 ఏళ్లుగా వాట్సప్‌లోనే తన క్లయింట్‌లతో టచ్‌లో ఉన్నారు. ఉన్నట్టుండి ఆ ఖాతాను బ్లాక్ చేశారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. అయితే ఏంటీ? కమ్యూనికేషన్ కోసం ఇతర యాప్‌లు కూడా ఉన్నాయి. వాటిని ఉపయోగించొచ్చు కదా..! ఈ మధ్యే స్వదేశీ యాప్ 'అర్టటై' కూడా వచ్చింది. దాన్ని వాడుకోండి. మేక్ ఇన్ ఇండియా! అని సూచించింది. ఈ పిటిషన్ హైకోర్టులో కూడా విచారణకు అర్హమైంది కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీనిపై ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరిస్తూ పిటిషన్‌ను తిరస్కరించింది. కోర్టు అనుమతితో పిటిషనర్ తన వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్నారు.దేశీయ సంస్థ జోహో అభివృద్ధి చేసిన అర్టటైకి విపరీతమైన ప్రజాదరణ లభిస్తోంది. ఇప్పటికే కోటి మందికి పైగా దీన్ని డౌన్‌లోడ్ చేసుకున్నారు. అర్టటై అంటే తమిళంలో పిచ్చాపాటీ సంభాషణ అని అర్థం. ఈ యాప్ ద్వారా మెసేజ్‌లు, వాయిస్, వీడియో కాల్స్ చేసుకోవటానికి, మీటింగుల్లో పాల్గొనటానికి, స్టోరీలు, ఫొటోలు, డాక్యుమెంట్స్ షేర్ చేసుకోవచ్చు.

# హైకోర్టు స్టేతో సుప్రీంలో సవాల్

(మొదటి పేజీ తరువాయి)

సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కోసం సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయిచింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ మను సింగ్వి తదితరులు జూమ్ మీటింగ్ లో మాట్లాడారు. హైకోర్టు స్థానిక సంస్థలు ఎన్నికల నోటిఫికేషన్, జీవో 9 మీద స్టే ఇవ్వడంపై తదుపరి చర్యల గురించి సుదీర్ఘంగా చర్చించారు. జీవో 9 ని అమలు చేసేందుకు సుప్రీం కోర్ట్ తలుపు తట్టాలని నిర్ణయానికి వచ్చారు.ఈ సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని సీఎం రేవంత్ అన్నారు. మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న లక్ష్యం గా మందుకెళ్తోంది. బీసీలకు రిజర్వేషన్లు విషయం తేల్చే వరకు స్థానిక ఎన్నికలకు వెళ్లబోమని ఇప్పటికే మంత్రులు చెప్పారు. మరో వైపు సుప్రీం తీర్పు ప్రకారం పాతపద్దతిలో అంటే.. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా స్థానిక ఎన్నికలు నిర్వహించుకోవచ్చని హైకోర్టు తెలిపింది. జీవో 9 పై మాత్రమే స్టే ఇచ్చిందని..రిజర్వేషన్ల విషయంలో క్లారిటీ ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రభుత్వానికి లేఖ రాసింది. మరోవైపు వచ్చే వారంలో క్యాబినెట్ భేటీ జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. కాగా హైకోర్టు జీవో 9పై స్టే విధిస్తూ, 2 వారాల్లో పిటిషనర్లు కౌంటర్ దాఖలు చేయాలని, అలాగే 4 వారాల్లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. తాజాగా బీసీ రిజర్వేషన్ల పై హైకోర్టు ఆర్డర్ కాపీ వెలువడింది. జీఓ 9, 41, 42 ల పై హైకోర్టు స్టే విధించింది. ట్రిపుల్ టెస్టు పాటించకపోవడం పై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. సుప్రీం కోర్టు నిబంధనల ప్రకారం 50 శాతం రిజర్వేషన్లు మించి ఉండడాన్ని తప్పుబట్టింది. తదుపరి విచారణ డిసెంబర్ 3 కు వాయిదా వేసింది. వికాస్ కృష్ణా రావు గవాలి, రాహుల్ రమేష్ వాగ్ కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పులను హైకోర్టు పరిగణలోకి తీసుకున్నది.

# విలువిద్యను దేశవ్యాప్తంగా ప్రోత్సహించడమే లక్ష్యం

**ప్రధాని మోదీని కలిసిన రామ్ చరణ్, ఉపాసన... కొత్తగా ప్రారంభించిన ఆర్చరీ లీగ్ విజయంపై చర్చ**

**న్యూఢిల్లీఅక్టోబర్ 11(జర్నలిస్ట్ వార్త):** టాలీవుడ్ అగ్రహీరో, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, ఆయన అర్ధాంగి ఉపాసన కొణిదెల శనివారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఇటీవల తాను ప్రారంభించిన ఆర్చరీ (విలువిద్య) లీగ్ విజయవంతమైన నేపథ్యంలో ప్రధానిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు రామ్ చరణ్ తన సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్నాయి.ఈ సమావేశంలో, భారతదేశంలో విలువిద్యకు పూర్వ వైభవం తీసుకువచ్చే లక్ష్యంతో ప్రారంభించిన ఆర్చరీ లీగ్ గురించి ప్రధాని మోదీకి వివరించినట్లు తెలుస్తోంది. దేశంలో ఈ క్రీడను మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడం, యువతను ప్రోత్సహించడం వంటి అంశాలపై వీరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. ప్రధానితో చరణ్, ఉపాసన దంపతులు ఎంతో ఉత్సాహంగా మాట్లాడుతున్న దృశ్యాలు ఫొటోలలో కనిపించాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ధనుస్సు చేతబట్టారు.భారత్‌లో ఐపీఎల్, ప్రో కబడ్డీ లీగ్‌ల తరహాలోనే విలువిద్య కోసం ప్రత్యేకంగా 2025లో తొలిసారిగా ఆర్చరీ లీగ్‌ను ఢిల్లీలో నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో తెలంగాణ, తమిళనాడు, ఝార?ండ్, మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్ సహా మొత్తం ఆరు రాష్ట్రాల జట్లు పోటీపడ్డాయి.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన
# తెలంగాణ ఉద్యమకారులు



**రాయపర్తి/అక్టోబర్ 11(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు తాళ్లపల్లి మధారు మనుమడు ఇటివల అనారోగ్యంతో మరణించగా శనివారం బాధిత కుటుంబాన్ని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ మండల అద్యక్షులు ఎనగందుల శ్యామ్ సుందర్ పరామర్శించారు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరమ్ ప్రధాన కార్యదర్శి రావు రాజిరెడ్డి .జిల్లా ఉపాధ్యక్షులు సుదగాని వెంకటేశ్వర్లు .మండల ఆర్గనైజర్ ముత్యం రవి,మండల సహాయ కార్యదర్శి ఊడుగుల వెంకన్న,గిద్దె వెంకన్న,కునుసోత్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**రాయపర్తి/అక్టోబర్ 11(జర్నలిస్ట్ వార్త):**మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన కందికట్ల కిష్టయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు.కలసి చదువుకున్న (1993-1994) పదో తరగతి చదువుకున్న మిత్రులు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి 11వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో కందికట్ల యాకయ్య, శ్రీనివాస్, విజయ్, వాసు,మహేందర్ రెడ్డి, సత్యం రాంబాబు, మోహన్ రావు,వీరభద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి జిల్లా పదవులు చేపట్టిన వారికి శుభాకాంక్షలు తెలిపిన రమేష్



**తల్లాడ/అక్టోబర్11(జర్నలిస్ట్ వార్త):**ఖమ్మం జిల్లా భారతీయ జనతా పార్టీ నూతన కమిటీ బాధితులు నియమితులైన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు రాయల రమేష్ చౌదరి, సత్తుపల్లి నియోజకవర్గం నుండి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నాయుడు రాఘవరావు కి ఉపాధ్యక్షులుగా నియమితులైన వీర రాజుకి సుదర్శన మిత్ర సేనాకి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నాగ సురేంద్ర రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు సత్తుపల్లి నియోజకవర్గం కు తగిన ప్రాధాన్యత ఇచ్చిన జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరావు కి ధన్యవాదాలు తెలుపుతున్న తల్లాడ మండలం బిజెపి ప్రధాన కార్యదర్శి రాయల రమేష్ చౌదరి, వారు పదవులకు ప్రజలకు అనుసందంగా ఉండి గౌరవం ఇవ్వాలని ప్రజలతో కలిసిమెలిసి ఉండి పార్టీని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

# మధ్యాహ్న భోజన పథకం వర్కర్లకు
# నెలకు 10000 రూపాయలు ఇవ్వాలి






**తల్లాడ/అక్టోబర్11(జర్నలిస్ట్ వార్త):**
మధ్యాహ్న భోజన పథకం వర్కర్లకు నెలకు 10000 రూపాయలు ఇవ్వాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్(ఏఐటియుసి) రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి డిమాండ్ చేశారు.శనివారం వారు మాట్లాడుతూ
తెలంగాణ రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వర్కర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం నెలకు పదివేల రూపాయలు చెల్లించాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి)రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి అన్నారు. తల్లాడ మండల కేంద్రంలో జివిఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో సంఘం నాయకురాలు మహదేవ లక్ష్మి, తాళ్లూరి లక్ష్మిల అధ్యక్ష వర్గంగా రెండవ మహాసభ జరిగింది. మహాసభలకు ప్రారంభ సూచకంగా జెండా ఆవిష్కరించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 54 వేలమంది మధ్యాహ్న భోజన పథకంలో వర్కర్లు పనిచేస్తున్నారన్నారు. 2023వ సంవత్సరములో ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు వారి పార్టీని అధికారంలోకి తీసుకువస్తే మధ్యాహ్న భోజన పథకం వర్కర్లకు నెలకు పదివేల రూపాయలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు ఆ హామీ ఊసు ఎత్తకపోవడం సమంజసం కాదన్నారు. అంగనవాడి ఉద్యోగులకు ఇస్తున్న మాదిరిగా మిడ్ డే మీల్స్ పథకానికి కూడా కోడిగుడ్లు తోపాటు నిత్యవసర వస్తువులు వస్తువులు అయినా కందిపప్పు, చింతపండు, నూనె ,గ్యాస్ ను ప్రభుత్వమే నేరుగా అందించాలని ఆమె ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. విద్యార్థులు తినే తిండి ఒకటే అయినప్పుడు ఎస్సీ ఎస్టీ బీసీ అంటూ తారతమ్యాలు చూపటం దురదృష్టకరమన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు చెల్లించే జీతాలతో పాటు, బిల్లులకు సంబంధించి స్టేట్ ట్రెజరీ నుంచి కాకుండా గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా కార్మికుల ఎకౌంటు లోకి పంపించాల్సిందేనన్నారు.
ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు మాట్లాడుతూ ఒకొక విద్యార్థికి 5.50 పైసల నుండి 9 , మరియు 11 రూపాయల వరకు ఇస్తున్నారని బయట హొటలలో భోజనం చేస్తే 120 రూపాయలు ఉంటుందని ఐదు రూపాయల 50 పైసలతో ఒక పూట భోజనం ఏ విధంగా పెట్టాలో ప్రభుత్వ పెద్దలు ఆలోచన చేయాలన్నారు. ఒకవైపు పౌష్టిక ఆహార లోపాన్ని రూపుమాపటాన్ని ఈ పథకాన్ని చేపట్టారని చెబుతూ కేవలం పది రూపాయలతో పౌష్టికాహార లోపాన్ని ఏ విధంగా తీరుస్తారో అధికారులే వివరించాలన్నారు. ప్రతి విద్యార్థికి 25 రూపాయలు చెల్లించాలన్నారు. కోడిగుడ్డు ధర మార్కెట్లో ఏడు రూపాయలు ఉండగా కేవలం ఐదు రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారని తద్వారా ఒకొక కార్మికురాలు ప్రతి వారానికి రెండు నుండి నాలుగు వందల రూపాయలు నష్టపోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వమే నేరుగా కోడిగుడ్లను పంపిణీ చేయాలన్నారు. మధ్యాహ్న భోజన వర్కర్స్ సమస్యల పరిష్కారం కై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో కార్యచరణ రూపొందిస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు అధ్యక్షులు గాదల లక్ష్మీనారాయణ, కార్యనిర్వాక అధ్యక్షులు రావి శివరామకృష్ణ, ఉపాధ్యక్షులు గుండెపుంగు మల్లేష్ , వేము రాంబాబు,బి కే ఎం యు వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ, ఏఐవైఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దోజు. శ్రావణ్ , సిపిఐ తల్లాడ మండల కార్యదర్శి ఓర్సు రమేష్ , ఏఐటియుసి జిల్లా నాయకులు దయాకర్,తెలగారపు రామారావు, కర్నాటి బసవయ్య, రహమతుల్లా,రహీం బీ తదితరులు పాల్గొన్నారు.

# రైతును రాజును చేయాలన్నదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం





## మంత్రి పొంగులేటి

**నేలకొండపల్లి/అక్టోబర్11 (జర్నలిస్ట్ వార్త):**
రైతును రాజును చేయడం, పేదలకు సొంత ఇల్లు ఇవ్వడం, ప్రతి అర్హుడికి రేషన్ కార్డు అందించడం... ఇదే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు.నేలకొండపల్లి మండలంలో శనివారం పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.ముజ్జుగూడెం గ్రామంలో ముజ్జుగూడెం నుండి గువ్వలగూడెం వరకు రూ.2.60 కోట్లు అంచనా వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి, పైనంపల్లి గ్రామంలో రూ.15 లక్షల అంచనా వ్యయంతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ....ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అప్పుల పాలైన తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రకాలుగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడా తగ్గనీయకుండా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యం ఇస్తున్నామని చెప్పారు.పది సంవత్సరాలుగా ఒక్క రేషన్ కార్డు ఇవ్వని పరిస్థితిని మార్చి...ప్రభుత్వం ఏర్పడిన తరువాత అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇచ్చామని వివరించారు. రాబోయే రోజుల్లో ప్రజల ఆశీర్వాదమే ప్రభుత్వానికి బలం కావాలన్నారు.పాలిచ్చే గేదె లాంటి ఈ ప్రభుత్వం ప్రజల దీవెనలతో ముందుకు సాగుతుందని మంత్రి పేర్కొన్నారు.

# కృష్ణా జలాలను వదులుకోం

## - మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హనుమకొండ బ్యూరో/అక్టోబర్11(జర్నలిస్ట్ వార్త):**
కృష్ణా నదీ జలాలను వదులుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సిద్ధంగా లేదని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి మరణంతో ఆయనను పరామర్శించేందుకు హనుమకొండకు విచ్చేసిన మంత్రి, అనంతరం మంత్రి సీతక్కతో కలిసి మీడియాతో మాట్లాడారు. కృష్ణా నదిలో నికర జలాలైనా, మిగులు జలాలైనా, వరద జలాలైనా ౹ తెలంగాణాకు చెందాల్సిన నీటివాటాలో ఒక్క చుక్క కూడా వదులుకోమన్నారు. ఈ అంశంపై కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్లో ప్రభుత్వం గట్టిగా వాదనలు వినిపించనుందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో 512 టీఎంసీల నీటిని ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించేందుకు ఒప్పుకుందని ఆయన ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఏ విధంగా ఉన్నా, తెలంగాణలో ఈ సీజన్‌లోనే అత్యధిక వరి పంట పండిందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులపై హరీష్ రావు చేస్తున్న తప్పుడు ఆరోపణలు నిలబెట్టలేవని, ఆయన ప్రభుత్వం మీద బదనాం చేయడం మానుకోవాలని మంత్రి సూచించారు. ఆంధ్రప్రదేశ్ చేపట్టిన బంకచర్ల ప్రాజెక్టును, ఆల్మట్టి ఎత్తు పెంపును తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని చెప్పారు. కృష్ణా ట్రిబ్యునల్ సమావేశానికి మంత్రి హొదాలో హాజరైన ఏకైక వ్యక్తి తానేనని ఉత్తమ్ గుర్తు చేశారు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి అచంచలమైన సంకల్పం ఉంది. మన వాటా నీటిలో ఒక్క చుక్క కూడా వదులుకోం," అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, కేఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, సిరిసిల్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్తు బాలికలదే

## -సామజిక కార్యకర్త బీరెడ్డి రమేష్.



**బయ్యారం/అక్టోబర్ 11 (జర్నలిస్ట్ వార్త):** దేశ భవిష్యత్తు బాలికలదేనని, బాలికలు భావి భారత దీపికలని సామజిక కార్యకర్త బీరెడ్డి రమేష్ తెలిపారు.శనివారం ప్రపంచ బాలికా దినోత్సవం సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడబిడ్డను కాపాడుకోవాలని, ఆడపిల్లల హక్కులు, నిత్యజీవితంలో వారు ఎదుర్కొంటున్న సవాళు ,సమస్యలు గురించి చర్చించి తగు చర్యలు తీసుకొనేందుకు ఏటా ఐక్య రాజ్య సమితి అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహిస్తుందని అన్నారు.బాలికల సాధికారత కోసం వారి ఆరోగ్యం,పోషకాహారం,చదువు, హింస నుంచి,లైంగిక దోపిడీ నుండి రక్షణ,భద్రతస్వేచ్ఛ వీటిపై ప్రభుత్వాలు, సమాజం,సంస్థలు కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలను ఏ దశలోనూ ప్రోత్సహించకూడదని చెప్పారు. బాలికల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.బాలికల హక్కుల పరిరక్షణ కుటుంబం నుండే ప్రారంభం కావాలన్నారు. చదువుకొనే స్వేచ్ఛ, నాణ్యమైన విద్య ,నైపుణ్యాలు బాలికలకు అందుబాటులో ఉన్నప్పుడే బాలికల భవిష్యత్తు అభివృద్ధి పథంలో చూడగలమని తెలిపారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



# బీసీ రిజర్వేషన్ల కోసం మా పోరాటం ఆగదు

## -బీజేపీ ఎత్తుగడలను అధిగమిస్తాం.

## -యూత్ కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ తమ్మిశెట్టి వెంకటపతి.



**బయ్యారం/అక్టోబర్ 11(జర్నలిస్ట్ వార్త ):** బీసీల రిజర్వేషన్ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం ఆగదని,అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్న బీజేపీ ఎత్తుగడలను అధిగమించి బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధించి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లి ఘన విజయం సాధిస్తామని భద్రాద్రి జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి తమ్మిశెట్టి వెంకటపతి అన్నారు.శనివారం ఆయన మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు కాకపోవడానికి ప్రధాన అడ్డంకి బీజేపీ పార్టీ అని అన్నారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుకు రాజ్యాంగ సవరణ అవసరం,కానీ బీజేపీ పార్టీ అందుకు సహకరించదు.రాష్ట్ర గవర్నర్ కూడా ఇప్పటివరకు బిల్ ఆమోదించకుండా పెండింగ్ లో పెట్టారు.జీవో నెంబర్ 9 పై వంగ గోపాల్ రెడ్డి లాంటి బిసి రిజర్వేషన్ వ్యతిరేకులు హైకోర్టులో పిటిషన్ వెయ్యగా,సుదీర్ఘ వాదనలు విన్న హైకోర్టు అక్టోబర్ 9న జీవో నెంబర్ 9 పై స్టే ఇచ్చింది.ఈతీర్పులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వానికి 4 వారాల్లో రిజర్వేషన్స్ పై కౌంటర్ దాఖలు చేయమని ఆదేశించింది.బీసీ రిజర్వేషన్ల సాధనలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అడ్డంకిగా మారిందని,గవర్నర్ రిజర్వేషన్ ఆర్డినెన్స్ పెండింగ్ పెట్టడం దీనిలో భాగమని తమ్మిశెట్టి వెంకటపతి ఆరోపించారు.దీనిపై బీసీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ లో ఇచ్చిన హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్ సాధించి తీరుతామని అన్నారు.

# పేదరికాన్ని జయించి ఎంబీబీఎస్ సీటు సాధించిన దళిత యువతి

## ఆర్థిక సహాయం అందించి ప్రోత్సహించిన డాక్టర్ ఎన్ సామ్యులు



**వర్ధన్నపేట/అక్టోబర్ 11(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలం అంబేద్కర్ నగర్ గ్రామానికి చెందిన అనపర్తి శృతి పేదరికాన్ని జయించి డాక్టర్ కావాలనే కలను నిజం చేసుకుంది. ఎంబీబీఎస్ ఉచిత సీటు సాధించి అందరి ప్రశంసలు పొందుతోంది.శృతి తండ్రి అనపర్తి స్వామి మేస్త్రీగా పనిచేసేవారు. అనారోగ్యంతో బాధపడడంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లి ఇంటి పనులు చేస్తూ ఆర్థికంగా తోడ్పడుతున్నారు.చిన్ననాటి నుంచే కష్టపడే స్వభావం కలిగిన శృతి తన ఊరిలో పది తరగతి వరకు చదివి, ఆ తరువాత పర్వతగిరి గురుకుల పాఠశాలలో ఇంటర్ విద్యను పూర్తిచేసింది. డాక్టర్ కావాలనే లక్ష్యంతో పట్టుదలగా చదివి లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుని రామగుండం సిమ్స్‌లో ఉచిత వైద్య సీటు సాధించింది.డాక్టర్ ఎన్స్ సామ్యులు మాట్లాడుతూ, “కృషి, పట్టుదల ఉంటే దేన్నైనా సాధించవచ్చు అని శృతి నిరూపించిందన్నారు. పేదరికం అడ్డుకాదు, ధైర్యం నమ్మకం ఉంటే ఏ కలనైనా నిజం చేయవచ్చు,అని తెలిపారు.శృతి విజయాన్ని పురస్కరించుకుని మాస్ సంస్థ వరంగల్ నిర్వాహకులు డాక్టర్ మహీందర్, ఇసాక్ ప్రభాకర్, డాక్టర్ చిన్నపెల్లి విజయ్ కుమార్, చింత బాబు, జోగుల కుమారస్వామి, మెటపెల్లి రవి తదితరులు శృతిని అభినందించి భవిష్యత్తులో కూడా ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# మామునూరు విమాన శిక్షణ కేంద్రంలో ఎన్.సి.సి. విద్యార్థులకు గగన విహారం




**వర్ధన్నపేట/అక్టోబర్11 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట జిల్లా పరిషత్ పాఠశాల ఎన్.సి.సి. విద్యార్థులకు మామునూరు విమాన శిక్షణ కేంద్రంలో మైక్రోలైట్ విమానంలో గగన విహార శిక్షణ నిర్వహించారు.నాలుగు (టి) వాయుసేన దళాధిపతి వింగ్ కమాండర్ ఆశిష్ ధనాకే ఆధ్వర్యంలో శనివారంనాడు జరిగిన ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో సుమారు ఇరవై ఐదుగురు ఎన్.సి.సి. విద్యార్థులు పాల్గొన్నారు. వారికి మైక్రోలైట్ విమానంలో గగన విహారం చేయించారు. ఈ సందర్భంగా ధనాకే మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడం ద్వారా భవిష్యత్తులో వారిని ఉన్నత స్థానాలకు చేర్చవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట జిల్లా పరిషత్ పాఠశాల అనుబంధ ఎన్.సి.సి. అధికారి నిమ్మ మనుజేందర్ రెడ్డి, సార్జెంట్ రెడ్డి, సార్జెంట్ రాయ్, సార్జెంట్ సుమన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాయిత శ్రీనివాస్ అభినందించారు.

# మెగా టెక్స్‌టైల్ పార్కులో ఉత్పత్తి

## ఎక్స్ వేదికగా కెటిఆర్ హర్షం

హైదరాబాద్, **అక్టోబర్ 11(జర్నలిస్ట్ వార్త):** వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో ఉత్పత్తిపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. మొదటి యూనిట్ ఉత్పత్తి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రపంచ మార్కెట్లకు టీషర్టులు ఎగుమతి చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో 2023లో కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో ఫ్యాక్టరీలకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. 11 యంగ్ వన్ కార్పొరేషన్ ఫ్యాక్టరీలకు భూమిపూజ చేశామన్నారు. అన్ని యూనిట్లు ప్రారంభమైతే.. వరంగల్ ప్రధాన వస్త్ర కేంద్రంగా మారుతుందని వివరించారు. 'వ్యవసాయం నుంచి ఫ్యాషన్' నినాదంతో టెక్స్‌టైల్ పార్కును స్థాపించినట్లు కేటీఆర్ చెప్పారు.

# ఘనంగా శ్రీ బుగులు వేంకటేశ్వర స్వామి కళ్యాణం




**స్టేషన్ ఘన్పూర్/అక్టోబర్ 11 (జర్నలిస్ట్ వార్త) :** చిల్పూర్ మండల కేంద్రంలోని చిల్పూర్ గుట్ట శ్రీ బుగు లు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రోజును పురస్కరించుకొని శ్రీస్వామివారి కల్యాణము వేద మం త్రోచరణలతో అర్చకులు వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం ఆలయ కార్యనిర్వాహణాధికారి బి లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించారు.వివిధ గ్రామాల నుండి పట్టణాల నుంచి భక్తులు అధిక సంఖ్యలోపాల్గొ న్నారు.కళ్యాణ అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో దేవా లయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ధర్మకర్తల మండలి సభ్యులు గణగోని రమేశ్,డాక్టర్ వేముల వెంకటేశ్వర్లు, తాళ్లపెల్లి బిక్షపతి,దేవాలయ ఈవో లక్ష్మీప్రసన్న, సూప రిండెంట్ వెంకటయ్య, ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, అర్చకులు సౌమిత్రి శ్రీ రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, రికార్డ్ అసిస్టెం ట్ వీరన్న, ఆలయ సిబ్బంది విశాల్, కృష్ణా, మహేష్, రాజ శేఖర్, అన్నప్ర సాద దాతలు నాగేశ్వర్ రావు - విజయలక్ష్మి, బోల్లాం శివశంకరయ్యా - నాగేంద్రమ్మ, సిహెచ్ నాగేశ్వర్ - ఉమారాణి,వలబోజు వెంకటేశ్వర్లు - పద్మావతి వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుడు అక్కెనపల్లి బాలరాజును సన్మానించిన మాజీ ఎమ్మెల్యే రాజయ్య



**స్టేషన్ ఘన్పూర్/అక్టోబర్ 11 (జర్నలిస్ట్ వార్త) :** తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు, మండలం లోని తాటికొండ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ అక్కెనపెల్లి బాలరాజును శనివారం తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య శాలువాతో ఘనంగా సన్మానించారు. జనగాం జిల్లా ఏర్పాటయి 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎమ్ ఎన్ ఆర్ గార్డెన్స్ లో ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహిం చబడింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ముఖ్య అతిథిగా పాల్గొని,పోరాటం చేసి సాధించిన జనగాంజిల్లా,సుమారు 500 రోజుల సుదీర్ఘ ప్రజా పోరాటం ఫలితంగా ఏర్పడింది. ఈ సందర్భంలో ఆ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకా రులను సన్మానించడం జరిగింది. అందులో భాగంగా మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఈ సందర్భంగా ఉద్యమకా రుడైన అక్కినపెల్లి బాలరాజు ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడు తూ తెలంగాణ ఉద్యమ సమయంలో చేసిన పోరాటా లను,జనగామ జిల్లా ఏర్పాటులో చేసిన పోరాటాలను గుర్తించి తనను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యకు ప్రత్యేకకృతజ్ఞతలు తెలిపారు.

# అక్రమ ఇసుక లారీ, జెసిబి స్వాధీనం

**హనుమకొండ బ్యూరో/అక్టోబర్11(జర్నలిస్ట్ వార్త):** ధర్మసాగర్ ఎస్ఐ ఎల్. దిలీప్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం ధర్మసాగర్ మండలంలోని రాయగూడెం సమీపంలోని సరస్వతి మాత ఆలయం వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీ, జెసిబిని గుర్తించి కస్టడీలోకి తీసుకున్నారు.విచారణలో ఆ లారీ భూక్య యాదగిరి (తీగల తండా)కు చెందినదని తేలింది. అనంతరం లారీ (టిప్పర్)ను, జెసిబిని ధర్మసాగర్ పోలీస్ స్టేషన్కు తరలించి కస్టడీలో ఉంచి కేసు నమోదు చేశారు.జెసిబి యజమాని మలోత్ ఠాగూర్, లారీ డ్రైవర్, జెసిబి డ్రైవర్లపై కూడా పోలీసులు కేసులు నమోదు చేసినట్లు సమాచారం.

# సిఎం రేవంత్ రెడ్డి నల్లమల పిల్లి

## కృష్ణా, గోదావరి నీళ్లు దోస్తున్నా ఉలుకేదీ

## -బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు వెటకారం

హైదరాబాద్,**అక్టోబర్ 11(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నల్లమల పులి కాదు.. నల్లమల పిల్లి అని మాజీ మంత్రి హరీశ్‌రావు సెటైర్లు వేశారు. కింది నుంచి గోదావరి నీళ్లు ఏపీ తీసుకుపోతే.. పైన కృష్ణా నీళ్లు కర్ణాటక తీసుకుపోతే, మన బ్రతుకు ఏం కావాలని హరీశ్‌రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి మొన్న మల్లికార్జున ఖర్గేను పరామర్శించడానికి కర్ణాటకకు వెళ్లినప్పుడు, ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపు గురించి సిద్ధరామయ్య, శివకుమార్ దగ్గర మాట్లాడుతాడను కున్నా. వాళ్ళ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అయినా రేవంత్ రెడ్డి మాట్లాడలేదు. ఆలమట్టి డ్యాం ఎత్తు పెంచితే తెలంగాణ ఎడారిగా మారుద్దని కనీసం బుద్ధి రేవంత్ రెడ్డికి లేదు. రాహుల్ గాంధీతో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక ఫోన్ కూడా చేపించలేకపోతున్నాడు రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డి ఢిల్లీకి బ్యాగులు మోయడం ఒక్కటే పని కాదు.. తెలంగాణ బాగోగుల గురించి కూడా పట్టించుకో అని హరీష్ రావు సూచించారు. ఏపీ 463 టీఎంసీల నీళ్లు మళ్లిస్తే నేను మీద 112 టీఎంసీలు ఆపుకుంటా అని కర్ణాటక అంటుంది.. నేను 74 టీఎంసీలు ఆపుకుంటా అని మహారాష్ట్ర అంటుంది. 112 టీఎంసీలు కర్ణాటక, 74 టీఎంసీలు మహారాష్ట్ర ఆపితే మన పరిస్థితి ఏంది. మాట్లాడితే నల్లమల బిడ్డ అంటాడు.. ఆ నల్లమలను అనుకొని పారే కృష్ణా నదిలో ఆ మహబూబ్ నగర్ జిల్లాకు నష్టం జరిగితే ఎందుకు మాట్లాడటం లేదు. నువ్వు నల్లమల పులివా, పిల్లివా, ఎలుకవా.. ఎందుకు మాట్లాడటం లేదు. పులి అయితే మాట్లాడేవాడివి.. పిల్లివి, ఎలుకవు కాబట్టి మాట్లాడటం లేదు అని హరీశ్‌రావు ఘాటుగా విమర్శించారు.

# బీఆర్ఎస్ నాయకుల ప్రవర్తన సిగ్గుచేటు

## బస్‌భవన్ వద్ద బస్సులు అడ్డుకోవడం దారుణం

**స్టేషన్ ఘన్పూర్/అక్టోబర్11 (జర్నలిస్ట్ వార్త) :** బీఆర్ఎస్ పార్టీనాయకులు బస్‌భవన్ వద్ద బస్సులను అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఘటన సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలిపాక సతీష్ తీవ్రంగావిమర్శించారు.డివిజన్ కేంద్రం లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో 10సంవత్సరాలు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వ కాలంలో ఆర్టీసీ కార్మికులు ఎలాంటి ఇబ్బందు లు ఎదుర్కొన్నారో ప్రజలు మరచిపోలేదన్నారు. ఆర్టీసీ కార్మికులు తమ హక్కుల కోసం పోరాడితే ఉద్యోగాల నుండి తీసేస్తామని బెదిరించిన వారు ఎవరో అందరికీ తెలిసిందే అన్నారు. ఆర్టీసీని ప్రైవేట్ పరంగా మార్చేం దుకు యత్నించి, 48 వేల మంది ఉద్యోగులను రోడ్డున పెట్టేంతవరకు వెళ్ళినవారు బీఆర్ఎస్ నేతలేనని గుర్తు చేశారు. ఆందోళన చేసిన కార్మికులపై కేసులు పెట్టి, పోలీస్ స్టేషన్లలో మహిళా ఉద్యోగులను పిల్లలతో కూర్చో బెట్టడం వంటి అమానవీయ ఘటనలు చోటు చేసుకున్నాయని, ఆ బాధలు ఇప్పటికీ కార్మికుల మన సుల్లో మిగిలి ఉన్నాయని తెలిపారు. మీ పాలనలో ఆర్టీసీ ఉద్యోగులు ఆత్మహత్యలుచేసుకున్నారు. గుండె పోటుతో ప్రాణాలు కోల్పోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సీఎం రేవంత్ రెడ్డి,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆర్టీసీ పునరుద్ధరణ దిశగా పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా నియోజకవర్గ నాయ కులు మామిడ్ల శ్రీనివాస్,గట్టు కోటి,నక్క పాపయ్య, గట్టు సురేందర్, గట్టు ఎల్లయ్య, జంపాల శ్రీకాంత్, శ్రీనివాస్, తాళ్లపల్లి కుమార్,ప్రసాద్,తదితరులు పాల్గొ న్నారు.



# రాయికల్ నుండి ధర్మపురికి బస్సు పునరుద్ధరించండి.

## రాయికల్ మండల వీరాపూర్ ఆలూరు గ్రామాల ప్రజల విజ్ఞప్తి

**రాయికల్ అక్టోబర్ 11(జర్నలిస్ట్ వార్త):** జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణం నుండి ధర్మపురి పుణ్య క్షేత్రానికి బస్సు నడపాలని రాయికల్ మండల ప్రజలు కోరుతున్నారు గతంలో కొరుట్లనుండి రాయికల్ ద్వారా వీరాపూర్ ఆలూరు రాజనగరం రంగపేట లసిందేపల్లి అర్పెల్లి గుల్లకోట కల్లెడ మీదుగా చిన్నాపూర్ నేరెళ్ల ధర్మపురికి కోరుట్ల డిపో నుండి బస్సు సౌకర్యము ఉండెను అట్టి బస్సును మళ్లీ పునరుద్ధరించాలని రాయికల్ పట్టణ ప్రజల కోరుతున్నారు దీని ద్వారా రాయికల్ మండలానికి బస్సు సంబంధం లేకుండా ఉన్న ఆలూరు వీరాపూర్ రాజనగరం మండలంలకు రాయికల్ మండలానికి రావడానికి ఈ బస్సు సౌకర్యం వీలుంటుంది తప్పనిసరిగా ఇట్టి బస్సు ను పునరుద్ధరించాలని ఆలూరు వీరాపూర్ రాజనగరం మండల ప్రజలు కొరుట్ల డిపో మేనేజర్ కు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కు మాజీ మంత్రి జీవన్ రెడ్డికి జగిత్యాల డిపో మేనేజర్ కు రాయికల్ మండల ప్రజలు విజ్ఞప్తి చేశారు



# రౌడీ జనార్ధన్‌గా వస్తున్న విజయ్ దేవరకొండ

వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు విజయ్ దేవరకొండ.. ఈ హీరో మరో చిత్రం 'రౌడీ జనార్దన్' ప్రారంభమైంది. రవి కిరణ్ కోలా దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో విజయ్ సరసన కీర్తి సురేశ్ నటిస్తున్నారు. శనివారం పూజా కార్యక్రమాలతో ఈ సినిమా ప్రారంభమైంది. నిర్మాత అల్లు అరవింద్ కల్‌ఆప్ కొట్టారు. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట షేర్ అవుతున్నాయి. ఈ కార్యక్రమానికి నిర్మాతలు దిల్ రాజు, అల్లు అరవింద్ హాజరయ్యారు. 'రాజావారు రాణిగారు' సినిమాతో తెలుగు ప్రేక్షకులను మెప్పించిన దర్శకుడే రవికిరణ్ కోలా. తొలి మూవీకి భిన్నంగా ఈసారి విజయ్‌తో యాక్షన్‌కు ప్రాధాన్యం ఉన్న కథను తెరకెక్కించనున్నారు. ఈనెల 16 నుంచి ముంబయిలో ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. మొదటిసారి విజయ్ సరసన కీర్తి సురేశ్ కనిపించనుండడంతో దీనిపై ఆసక్తి ఏర్పడింది.

# మీతో స్క్రీన్ షేర్ చేసుకోవడం అదృష్టం

## బిగిబి అమితాబ్‌కు బర్త్‌డే విషెస్ చెప్పిన ప్రభాస్



బాలీవుడ్ సూపర్ స్టార్ హీరో అమితాబ్ బచ్చన్ అక్టోబర్ 11న అంటే..శనివారం 83వ ఏడాదిలోకి అడుగు పెట్టారు. ఈ సందర్భంగా అతడికి సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుఉన్నాయి. టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా బిగ్ బీకి బర్త్ డే విషెస్ తెలిపారు. ఈ పోస్టులో 'మీకు దగ్గర ఉండి మీ వర్క్‌ను చూడడం, మీతో కలిసి స్క్రీన్ పంచుకోవడం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను.. మీరు ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలి అంటూ రెబల్ స్టార్ ప్రభాస్ విషెస్ చేశారు. ఇక, వీరిద్దరి కాంబినేషన్‌లో గతేడాది విడుదలైన 'కల్కి 2898 ఏడీ' థియేటర్లలో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. భారీ బ్జడెట్‌తో తెరకెక్కిన ఈ మూవీ రూ.1000 కోట్లకు పైగా వసూళు రాబట్టింది. ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో అమితాబ్ బచ్చన్.. అశ్వత్థామగా, ప్రభాస్ భైరవగా నటించారు. ప్రస్తుతం దీని సీక్వెల్ పనులు కొనసాగుతున్నాయి. అయితే, ప్రస్తుతం 'కల్కి2'కు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది. ఈ భారీ ప్రాజెక్ట్ నుంచి ఇప్పటికే దీపిక పదుకొణెను వైజంతి మూవీస్ తొలగించిన విషయం తెలిసిందే. దీంతో కల్కి2 సీక్వెల్‌లో ఆమె పాత్రను ఎవరు పోషిస్తారా అనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ఈ పాత్రలో బాలీవుడ్ క్వీన్ అలియా భట్ నటించనున్నట్లు న్యూస్ వస్తుంది. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన కోసం అభిమానులు వేచి చూస్తున్నారు.



# ఓ భారీ సినిమా కోసం కష్టపడుతున్నా

## అల్లుతో సినిమాపై అట్లీ కామెంట్స్



అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా గురించి అట్లీ ఓ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రేక్షకులు ఆశ్చర్యపోయే ప్రపంచాన్ని సృష్టించనున్నట్లు తెలిపారు. తాజాగా బెంగళూర్‌లో జరిగిన పికిల్‌బాల్ టోర్నమెంట్‌కు అట్లీ అతిథిగా హాజరయ్యారు. ఇందులో ఈ మూవీ గురించి మాట్లాడారు. 'ఏదైనా ఒక్క ఆలోచనతోనే ప్రారంభమవుతుంది. ఈ సినిమాతో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వడానికి మేం ప్రయత్నిస్తున్నాం. ఆడియన్స్ ఆశ్చర్యపోయేలా కొత్త ప్రపంచాన్ని సృష్టించనున్నాం. దేవుడు మా ప్రయాణంలో ప్రతి అడుగులోనూ తోడున్నాడు. ఆయన దయ వల్ల అంతా మేం అనుకున్నట్లే జరుగుతుందని ఆశిస్తున్నా. ఇంత భారీ ప్రాజెక్ట్‌ను రూపొందించడం రిస్క్‌గా అనుకోవడం లేదు. నేను దీన్ని ఎంజాయ్ చేస్తున్నా మరి కొన్ని నెలల్లో మీరు దీన్ని ఆస్వాదిస్తారని అట్లీ తెలిపారు. ఇక తాజాగా వచ్చిన 'కాంతార చాప్టర్ 1'పై అట్లీ ప్రశంసలు కురిపించారు. అదో అద్భుతమన్నారు. 'కాంతార 1'ను నేను మొదటి రోజు చూశాను. విదేశాల్లో ఉండడంతో థియేటర్‌కు వెళ్లడం కోసం దాదాపు రెండున్నర గంటలు డ్రైవ్ చేసుకుంటూ వెళ్లాను. సినిమా చూడగానే రిషబ్‌కు ఫోన్ చేసి అభినందించా. నేను చాలా గౌరవించే వ్యక్తుల్లో రిషబ్ ఒకరు. నాకు మంచి స్నేహితుడు. ఇలాంటి సినిమాను రూపొందించడం ఎంత కష్టమో ఒక దర్శకుడిగా నాకు తెలుసు. రిషబ్ ఎంతోమందికి స్ఫూర్తి. ఆయన ఈ సినిమాతో మరో జాతీయ అవార్డు గెలుచుకోవాలని ఆశిస్తున్నానని అట్లీ తెలిపారు.

# ఘనంగా నార్నే నితిన్ వివాహం..

## బావమరిది పెళ్లిలో తారక్ ఫ్యామిలీ సందడి



యంగ్ టైగర్ ఎన్టీఆర్ బావమరిది, టాలీవుడ్ యువ నటుడు నార్నే నితిన్ ఒక ఇంటివాడయ్యారు. శివానీ అనే యువతితో ఆయన వివాహం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. హైదరాబాద్ శివారులోని శంకర్‌పల్లిలో జరిగిన ఈ వేడుకకు సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ పెళ్లిలో జూనియర్ ఎన్టీఆర్ తన సతీమణి లక్ష్మీ ప్రణతి, కుమారులు అభయ్ రామ్, భార్గవ్ రామ్‌లతో కలిసి పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

వధువు శివానీ నెల్లూరు జిల్లాకు చెందిన వెంకట కృష్ణ ప్రసాద్, స్వరూప దంపతుల కుమార్తె. ఆమె కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉంది. అంతేకాకుండా ఆమె టాలీవుడ్ సీనియర్ హీరో దగ్గుబాటి వెంకటేశ్‌కు బంధువుల అమ్మాయి కావడం విశేషం. దీంతో ఈ వివాహం సినీ, రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది. గతేడాది నవంబర్ 3న నితిన్, శివానీల నిశ్చితార్థం హైదరాబాద్‌లో జరగ్గా, ఇప్పుడు పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు."మ్యాడ్" సినిమాతో 2023లో హీరోగా పరిచయమైన నార్నే నితిన్, తొలి చిత్రంతోనే మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత "ఆయ్", "మ్యాడ్ స్క్వేర్" వంటి చిత్రాలతో వరుస విజయాలు అందుకుని ఇండస్ట్రీలో తనకంటూ ఓ స్థానాన్ని సంపాదించుకున్నారు. ఇటీవలే "శ్రీశ్రీశ్రీ రాజావారు" సినిమాతో ప్రేక్షకులను పలకరించారు.



# లక్‌కోసం ఎదురు చూస్తున్న కృతిశెట్టి

తొలి సినిమాతోనే తెలుగులో గ్రాండ్ సక్సెస్ అందుకున్న భామల్లో ఒకరు కృతిశెట్టి. ఉప్పెన సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. అద్భుతమైన నటనతో కుర్రకారు మనసు దోచేసిన కృతిశెట్టి ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంది. కానీ ఆ తర్వాత చేసిన సినిమాలు మాత్రం కృతిశెట్టికి నిరాశనే మిగిల్చాయని చెప్పాలి. కృతిశెట్టి హీరోయిన్‌గా నటించిన కస్టడీ, మనమే, ది వారియర్, మాచెర్ల నియోజకవర్గం సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఈ వరుస ఫెయిల్యూర్స్ టాలీవుడ్‌లో కృతిశెట్టి ప్రయాణంపై ప్రభావం చూపించాయి. అయితే ఇక చేసేదేమి లేక తమిళంలో తన లక్‌ను పరీక్షించుకోవాలనుకున్నకృతిశెట్టి అక్కడ మూడు సినిమాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాపులర్ యాక్టర్లతో సినిమాలు చేసి.. షూటింగ్స్ పూర్తి చేసినా పలు కారణాల వల్ల ఆలస్యమవుతూ వచ్చాయి. తీవ్ర నిరాశలో ఉండిపోయిన కృతిశెట్టి అభిమానుల కోసం వరుసగా ఆ సినిమాలు విడుదలకు రెడీ అయ్యాయి. పై మూడు సినిమాలు ఒకేసారి ఒకే నెలలో విడుదలకు ముస్తాబవుతున్నాయి. ఈ మూడు ప్రాజెక్టులు కూడా డిసెంబర్ నెలలోనే రిలీజ్ కాబోతుండటం విశేషం.కృతిశెట్టి కార్తీతో కలిసి నటిస్తున్న వా వాథియార్, ప్రదీప్ రంగనాథన్ లవ్ ఇన్సూరెన్స్, రవిమోహన్ సినిమాలు డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. చాలా కాలంగా సరైన బ్రేక్ ఎదురుచూస్తున్న కృతిశెట్టికి ఈ డిసెంబర్ అయినా కలిసి రావాలని కోరుకుంటున్నారు అభిమానులు, ఫాలోవర్లు.

# సిద్దూ సినిమా.. ఓ రొమాంటిక్ డ్రామా హీరోయిన్ శ్రీనిధిశెట్టి

కేజీఎఫ్ సినిమాతో హీరోయిన్‌గా బ్లాక్ బస్టర్ హిట్టందుకుంది శ్రీనిధి శెట్టి. తెలుగులో నానితో హిట్ 3లో కలిసి నటించింది. ఈ భామ ప్రస్తుతం సిద్దుజొన్నలగడ్డతో రొమాంటిక్ ఎంటర్‌టైనర్ తెలుసు కదా సినిమాలో నటిస్తుంది. ఈ మూవీ అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా గురించి ఆసక్తికర విషయాలు షేర్ చేసుకుంది శ్రీనిధిశెట్టి. చిట్ చాట్ సెషన్‌లో శ్రీనిధి శెట్టి మాట్లాడుతూ.. కేజీఎఫ్, హిట్ 3 లాంటి వయోలెన్స్, రక్తపాతం చుట్టూ తిరిగే సినిమాల తర్వాత సున్నిత భావోద్వేగాలతో సాగే సినిమా ఇది. ఈ మూవీ నాకు ఉత్తేజాన్ని కలిగించే మార్పులాంటిది. ఈ చిత్రాన్ని ప్రతీ ఒక్కరూ ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నానంది. తెలుసు కదా ప్రేమ, ఎమోషన్, నవ్వులు, అందమైన పాటలతో సాగే కమర్షియల్ సినిమా. ఈ సినిమా చూసిన తర్వాత మూవీ లవర్స్ ఒక అందమైన రొమాంటిక్ డ్రామాను చూసినట్టు ఫీల్ అవుతారంది శ్రీనిధి శెట్టి . సినిమాకు పనిచేయడం గురించి మాట్లాడుతూ.. నాకు డైరెక్టర్ నీరజ కోన, సిద్ధు, రాశీ ఖన్నాతో కలిసి నటించే అద్భుతమైన సమయం దొరికింది. నీరజ కోన చాలా సపోర్ట్‌గా నిలిచే వ్యక్తి. ప్రేక్షకులు ఖచ్చితంగా సిద్ధు పాత్రతో ప్రేమలో పడిపోతారు. అతడికి ప్రతీ విభాగంలో అద్భుతమైన ప్రావీణ్యం ఉంది. రాశీఖన్నా చాలా క్రమశిక్షణతో ఉండే వ్యక్తి అని చెప్పుకొచ్చింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి పనిచేయడం గొప్పగా భావిస్తున్నానంది. సినిమాల పట్ల ఎంతో ప్యాషన్ ఉన్న నిర్మాతలతో కలిసి పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానంది శ్రీనిధిశెట్టి.

